# చదువు

## గ్రామ, వార్డు సచివాలయ పరీక్షల ప్రత్యేకం



గ్రామ, వార్డు సచివాలయాల పోస్టుల భర్తీకి పోటీ పడుతున్న అభ్యర్థులందరికీ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై ప్రత్యేకమైన అవగాహన అవసరం. సంక్షేమ కార్యక్రమాలు, వాటి లక్ష్యాలు, జీవన ప్రమాణాల మెరుగుకు అవి దోహదపడుతున్న తీరును పరీక్షార్థులు అధ్యయనం చేయాలి.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - సంక్షేమ పథకాలు

# పథకాలపై కుదరాలి పట్టు!



సమాజంలోని వివిధ బలహీన వర్గాలకు రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఫ్రీ-పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షల అధ్యయన కేంద్రాల ఏర్పాటు; విదేశీ విద్య, జీవనోపాధి అభివృద్ధికి, సాంఘిక కార్యక్రమాలు, మహిళా సాధికారతకు ఆర్థిక సహాయం, మెరుగైన ఆరోగ్యానికి వైద్య సహాయం, సాదర జీవిత బీమా/ప్రమాద బీమా, సామాజిక భద్రతా పెన్షన్లు లాంటి కార్యక్రమాలు అమలు చేసి ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ముఖ్య ఉద్దేశం.

2014, జూన్ 2న నూతన రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గత రాష్ట్ర ప్రభుత్వం (2014-19) సమాజంలోని వివిధ వర్గాలకు అనేక సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న 'నవరత్నాలు'లో భాగంగా సమాజంలోని వివిధ వర్గాల కోసం అనేక నూతన పథకాలను ప్రకటించింది.

## వైఎస్ఆర్ పెన్షన్ కానుక

◗ నూతన రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పెన్షన్ల పథకం పేరును 'వైఎస్ఆర్ పెన్షన్ కానుక'గా మార్చింది. ఈమేరకు 2019 మే 30న ఉత్తర్వులు జారీ చేసింది (గతంలో దీని పేరు ఎన్‌టీఆర్ భరోసా). ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకాన్ని 2019 జూన్ నుంచి అమలై, 2019 జులై 1 నుంచి పెన్షన్ చెల్లింపులు జరిగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఈ పథకం కింద లబ్ధిదారులను గుర్తించడానికి వయఃపరిమితిని 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించింది. ◗ ఈ పథకం కింద మొత్తం 12 రకాల సామాజిక భద్రతా పెన్షన్‌లను అందిస్తున్నారు. దీనిలో భాగంగా వృద్ధులు, వితంతువులు; చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులు, ఎయిడ్స్ రోగులకు పెన్షన్‌ను నెలకు రూ.2000 నుంచి రూ.2250కు పెంచారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, డప్పు కళాకారులకు నెలకు రూ.3000కు పెంచారు; గతంలో డయాలసిస్ రోగులకు ఇచ్చే రూ.3500 పింఛన్‌ను రూ.10,000కు పెంచారు. ◗ ఆంధ్రప్రదేశ్ సామాజిక ఆర్థిక సర్వే 2018-19 ప్రకారం 2019 ఏప్రిల్‌లో మొత్తం 54,28,247 మంది లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. వీరిలో అత్యధికంగా వృద్ధులు (23,43,474), వితంతువులు (20,02,626) లబ్ధి పొందుతున్నారు. ◗ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడంతో పాటు తలసేమియా, పక్షవాతం, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు కూడా పింఛన్‌లు మంజూరు చేస్తే ఈ పథకం లబ్ధిదారులు 65 లక్షల వరకు ఉంటారని అంచనా. ప్రస్తుతం ఇస్తున్న రూ.2250ను నాలుగేళ్లలో రూ.3000కు పెంచుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో 2019-20 సంవత్సరానికి రూ.15,746.58 కోట్లను కేటాయించింది.



వి. కరుణ
విషయ నిపుణులు

## వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద వివిధ కేటగిరీలు..

| పెన్షన్ రకం | అర్హతా ప్రమాణం | పెన్షన్ మొత్తం (రూ.) |
|---|---|---|
| వృద్ధాప్య పెన్షన్ | 1) 60 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు గల వృద్ధులు, నిరాశ్రయులు<br>2) పీవీటీజీ గిరిజన తెగలవారికి వృద్ధాప్య పెన్షన్ అర్హత వయసు 50 ఏళ్లు | 2,250 |
| వితంతు పెన్షన్ | వివాహచట్టం ప్రకారం 18 ఏళ్లు లేదా ఆపై వయసుగలవారు | 2,250 |
| చేనేత కార్మికుల పెన్షన్ | 50 ఏళ్లు లేదా అంతకు మించి వయసు గలవారు, నిరాశ్రయులు. | 2,250 |
| దివ్యాంగుల పెన్షన్ | కనీసం 40 శాతం వైకల్యం ఉన్నవారు (వీరికి వయసుతో సంబంధం లేదు) | 3,000 |
| కల్లుగీత కార్మికుల పెన్షన్ | 1. 50 ఏళ్లు లేదా ఆపైన వయసు గలవారు.<br>2. కల్లుగీత సహకార సంఘాల సభ్యులు లేదా గీతకార్మికుల కోసం చెట్టుపథకం కింద వ్యక్తిగత కార్మికులు, 2009 ఫిబ్రవరి 1 నాటికి 50 ఏళ్లు నిండినవారు | 2,250 |
| ఎయిడ్స్ రోగుల పెన్షన్ | 1. వయసుతో సంబంధం లేదు<br>2. యాంటీ రిట్రోవైరల్ థెరపీపై 6 నెలల నిరంతర చికిత్స చేయించుకున్నవారు | 2,250 |
| కిడ్నీ రోగుల పెన్షన్ | 1. వయసుతో సంబంధం లేదు<br>2. నిరంతర కిడ్నీ డయాలసిస్ వ్యాధిగ్రస్తులు | 10,000 |
| ట్రాన్స్‌జెండర్ పెన్షన్ | 18 ఏళ్లు లేదా అంతకుమించి వయసున్న ట్రాన్స్‌జెండర్‌లు | 3,000 |
| మత్స్యకారుల పెన్షన్ | 50 ఏళ్లు లేదా అంతకుమించి వయసున్న మత్స్యకారులు | 2,250 |
| సంప్రదాయ చర్మకారుల పెన్షన్ | 40 ఏళ్లు పైబడిన సంప్రదాయ చర్మకారులు | 2,250 |
| డప్పు కళాకారుల పెన్షన్ | 50 ఏళ్లు పైబడిన డప్పు కళాకారులు | 3,000 |
| ఒంటరి మహిళల పెన్షన్ | 1. పెళ్లైన మహిళ అయితే పెన్షన్ పొందే సమయానికి 35 ఏళ్లు నిండి, భర్త నుంచి విడిపోయి సంవత్సరం దాటాలి.<br>2. కుటుంబ మద్దతులేని అవివాహిత ఒంటరి మహిళకు గ్రామీణ ప్రాంతాల్లో 30 ఏళ్లు, పట్టణాల్లో 35 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉండాలి. | 2,250 |

పై అర్హతలతో పాటు వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ప్రయోజనం పొందేవారు ఉమ్మడిగా కింది అర్హతలను కలిగి ఉండాలి.
- ప్రతిపాదిత లబ్ధిదారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబం నుంచి తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి.
- అతడు/ఆమె సంబంధిత జిల్లాలో స్థానిక నివాసాన్ని కలిగి, ఏ ఇతర పెన్షన్ పథకం కింద నమోదై ఉండరాదు.

## సామాజిక భద్రత పెన్షన్‌లకు అనర్హులు

✦ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు
✦ ప్రభుత్వ ఉద్యోగ పింఛన్లు పొందేవారు
✦ ఆదాయపన్ను చెల్లించేవారు
✦ 2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట లేదా ఈ రెండూ కలిపి 5 ఎకరాల కంటే ఎక్కువ కలిగిన భూయజమానులు (ఐటీడీఏ పరిధిలోని షెడ్యూల్డ్ ప్రాంతాల ఎస్టీలు మినహా). అనంతపురంలో అయితే 5 ఎకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట భూమి కంటే ఎక్కువ గల భూయజమానులు. ✦ పొరుగు సేవల (ఔట్‌సోర్స్) ఉద్యోగులు ✦ ప్రైవేటు ఉద్యోగులు (నెలవారీ జీతాలు పొందేవారు)
✦ కారు యజమాని ✦ స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పొందేవారు

● జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా స్థాయిలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకం మొత్తం అమలును జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ (డీఆర్‌డీఏ), ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షిస్తారు.

● ఈ పథకం మొత్తం లబ్ధిదారుల్లో 44.38 % వృద్ధాప్య పెన్షన్లు, 37.56 % వితంతు పెన్షన్లు, 11.81 % దివ్యాంగుల పెన్షన్లు ఉండగా తర్వాతి స్థానాల్లో ఒంటరి మహిళలు; చేనేత, కల్లుగీత కార్మికులు; హెచ్ఐవీ, కిడ్నీ బాధితుల పెన్షన్‌లు ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్ పెన్షన్ దారులు అత్యల్పంగా 0.03 % ఉన్నారు.



మరిన్ని పథకాల వివరాల కోసం https://t.ly/JZOMZ లింక్ లేదా www.eenadupratibha.net చూడవచ్చు

## వైఎస్ఆర్ బీమా (పీఎంజేజేబీవై - వైఎస్ఆర్ బీమా)

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో అసంఘటిత రంగంలో పనిచేసే పేద కార్మికుల కుటుంబాల్లోని కార్మికులు అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తు అకాలమరణానికి గురైనప్పుడు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబరు 2 నుంచి ప్రమాద బీమా పథకాన్ని అమలుచేస్తోంది. దీన్ని గత ప్రభుత్వం పీఎంజేజేబీవై - చంద్రన్న బీమా పేరుతో అమలుచేసింది. నూతన ప్రభుత్వం దీన్ని పీఎంజేజేబీవై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) - వైఎస్ఆర్ బీమా పథకంగా మారుస్తూ 2019 జులై 22న ఉత్తర్వులు జారీ చేసింది.

☛ గతంలో 51-60 ఏళ్ల మధ్య వయసు వారు సహజంగా మరణిస్తే రూ.30,000 ఇచ్చేవారు. నూతన ప్రభుత్వం దాన్ని రూ.1,00,000కు పెంచనున్నట్లు ప్రకటించింది.

☛ వైఎస్ఆర్ బీమా పథకానికి 2019-20 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.404.02 కోట్లు కేటాయించారు.

### వైఎస్ఆర్ బీమా పథకానికి అర్హతలు

☛ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు
☛ 18 - 70 ఏళ్ల వయసు గలవారు
☛ నెలసరి ఆదాయం రూ.15,000 కంటే తక్కువ ఉన్నవారు
☛ మాగాణి భూమి 2.5 ఎకరాలు లేదా మెట్ట భూమి 5 ఎకరాల కంటే తక్కువ ఉన్నవారు
☛ ఈ పథకంలో భాగంగా ప్రమాద బీమాకు సంబంధించి మొత్తం నాలుగు రకాల బీమా ప్రీమియంలు ఉన్నాయి.
1) ఆమ్ ఆద్మీ బీమా యోజన (AABY)
2) ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (PMJJBY)
3) ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (PMSBY)
4) రాష్ట్ర ప్రభుత్వ వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ

### వైఎస్ఆర్ బీమా ప్రయోజనాలు

| అంశం | ప్రయోజనం (రూ.) |
|---|---|
| ప్రమాద మరణం | 5,00,000 |
| పూర్తి అంగవైకల్యం | 5,00,000 |
| పాక్షిక అంగవైకల్యం | 2,50,000 |

సహజ మరణం
1) 18-50 మధ్య వయసు వారికి 2,00,000
2) 51-60 మధ్య వయసు వారికి 30,000

బాధితుల పిల్లలకు ఉపకార వేతనం 9, 10, ఇంటర్, ఐటీఐ చదువుతున్నవారికి ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లల వరకు

## మాదిరి ప్రశ్నలు

1. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ పథకాన్ని ఏ పేరుతో అమలుచేస్తోంది?
   1) వైఎస్ఆర్ ఆసరా
   2) వైఎస్ఆర్ అభయహస్తం
   3) వైఎస్ఆర్ భరోసా
   4) వైఎస్ఆర్ పెన్షన్ కానుక
2. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి తొలి సంతకాన్ని ఏ పథకానికి సంబంధించిన ఫైలుపై చేశారు?
   1) వైఎస్ఆర్ రైతు భరోసా
   2) వైఎస్ఆర్ పెన్షన్ కానుక
   3) వైఎస్ఆర్ ఆసరా
   4) వైఎస్ఆర్ చేయూత
3. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద లబ్ధిదారులను గుర్తించడానికి వయఃపరిమితిని ఎంతకు తగ్గించింది?
   1) 70 నుంచి 65 ఏళ్లకు
   2) 65 నుంచి 60 ఏళ్లకు
   3) 65 నుంచి 45 ఏళ్లకు
   4) 60 నుంచి 45 ఏళ్లకు
4. వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద డయాలసిస్ రోగుల పెన్షన్‌ను ఎంతకు పెంచారు?
   1) రూ.3500 2) రూ.5000
   3) రూ.7500 4) రూ.10,000
5. సామాజిక భద్రతా పింఛన్ పథకం కింద అత్యధికంగా లబ్ధి పొందుతున్న వర్గం?
   1) వృద్ధులు 2) వితంతువులు
   3)దివ్యాంగులు 4)ఒంటరిమహిళలు
6. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019-20 సంవత్సరానికి ఎంత బడ్జెట్‌ను కేటాయించింది?
   1) రూ.13,746.58 కోట్లు
   2) రూ.14,746.58 కోట్లు
   3) రూ.15,746.58 కోట్లు
   4) రూ.16,746.58 కోట్లు
7. వైఎస్ఆర్ బీమా పథకానికి సంబంధించి సరికానిది?
   1) ప్రమాద మరణానికి ఆర్థిక సహాయం రూ.5,00,000
   2) పూర్తి అంగవైకల్యానికి ఆర్థిక సహాయం రూ.5,00,000
   3) పాక్షిక అంగవైకల్యానికి ఆర్థిక సహాయం రూ.2,50,000
   4) సహజ మరణానికి ఆర్థిక సహాయం రూ.30,000

**సమాధానాలు**
1-4; 2-2; 3-2; 4-4; 5-1; 6-3; 7-4.

# నోటీస్ బోర్డు

## ప్రభుత్వ ఉద్యోగాలు

### ఎస్ఎస్‌సీ - జేఈ ఎగ్జామ్, 2019

దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ (జేఈ) పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టు:** జూనియర్ ఇంజినీర్ **ఖాళీలు:** తర్వాత వెల్లడిస్తారు. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా, అనుభవం. **గరిష్ఠ వయసు:** వాటర్ కమిషన్, పబ్లిక్ వర్క్స్ పోస్టులకు 32 ఏళ్లు; మిగిలినవాటికి 30 ఏళ్లు. **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ రాతపరీక్ష, డిస్క్రిప్టివ్ టెస్ట్ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 12
**వెబ్‌సైట్:** https://ssc.nic.in/

## వాక్-ఇన్స్

### ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. న్యూదిల్లీలో కాంట్రాక్టు టెక్నికల్ ఆఫీసర్ల భర్తీకి వాక్ఇన్ నిర్వహిస్తోంది.
**పోస్టు:** టెక్నికల్ ఆఫీసర్ **ఖాళీలు:** 20
**విభాగాలవారీ ఖాళీలు:** ఈసీఈ-13, ఈఈఈ-02, సీఎస్ఈ-04, మెకానికల్-01
**అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, ఏడాది అనుభవం. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **వాక్ఇన్ తేదీ:** ఆగస్టు 28 **వేదిక:** ఈసీఐఎల్ జోనల్ ఆఫీస్, న్యూదిల్లీ. **వెబ్‌సైట్:** www.ecil.co.in

## ప్రవేశాలు

### యోగా సైన్సులో డిప్లొమా

న్యూదిల్లీలోని భారత ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా... 2019-20 సంవత్సరానికిగానూ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
**కోర్సు:** డిప్లొమా ఇన్ యోగా సైన్స్
**కాలవ్యవధి:** ఏడాది **సీట్ల సంఖ్య:** 75 **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా. **పరీక్ష తేదీ:** సెప్టెంబరు 1
**దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేదీ:** ఆగస్టు 27
**వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

## సందేహాలకు ఆహ్వానం



సచివాలయ పోస్టులకు లక్షలాది మంది పోటీ పడుతున్నారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సందేహాలకు 'ఈనాడు-చదువు' సమాధానాలను అందించనుంది. అభ్యర్థులు సిలబస్, ప్రిపరేషన్, పరీక్షల పరంగా వచ్చే ఇతర ప్రశ్నలను ఈ కింది ఈ-మెయిల్‌కు పంపాలి.

**e-mail:** edc@eenadu.in

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు - సవరించిన పరీక్షల తేదీలు, ఇతర వివరాలు

| పరీక్ష తేది | సమయం | పోస్టులు | పార్టు-ఎ | | పార్టు-బి | |
|---|---|---|---|---|---|---|
| | | | మార్కులు | మాధ్యమం | మార్కులు | మాధ్యమం |
| 1.9.2019 | ఉదయం | 1) పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5<br>2) వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ (మహిళా పోలీస్)<br>3) వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ (రూరల్)<br>4) వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ | 75 | ఇంగ్లిష్, తెలుగు | 75 | ఇంగ్లిష్, తెలుగు |
| 1.9.2019 | మధ్యాహ్నం | పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్ |
| 3.9.2019 | ఉదయం | 1) వీఆర్‌వో 2) సర్వే అసిస్టెంట్ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 3.9.2019 | మధ్యాహ్నం | ఏఎన్ఎమ్/వార్డు హెల్త్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | తెలుగు |
| 4.9.2019 | ఉదయం | విలేజ్ అగ్రికల్చర్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 4.9.2019 | మధ్యాహ్నం | విలేజ్ హార్టికల్చర్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 6.9.2019 | ఉదయం | విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 6.9.2019 | మధ్యాహ్నం | యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 7.9.2019 | ఉదయం | 1) ఇంజినీరింగ్ అసిస్టెంట్ (గ్రేడ్-2)<br>2) వార్డు ఎమినిటీస్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్ |
| 7.9.2019 | మధ్యాహ్నం | విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 8.9.2019 | ఉదయం | వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్ |
| 8.9.2019 | ఉదయం | వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 8.9.2019 | మధ్యాహ్నం | వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |
| 8.9.2019 | మధ్యాహ్నం | వార్డు సానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ (గ్రేడ్-2) | 50 | ఇంగ్లిష్, తెలుగు | 100 | ఇంగ్లిష్, తెలుగు |